ఏరువాక.. సవ్యంగా సాగాలిక..


వెదురుపట్టులో వరి నాట్లు వేస్తున్న కూలీలు

సాగు వివరాలు		
మొత్తం రైతులు	:	5,112
సాగయ్యే భూమి	:	12,650 ఎకరాలు
వరిసాగు	:	11,900 ఎకరాలు
వేరుశనగ	:	450 ఎకరాలు
ఇతర పంటలు	:	300 ఎకరాలు

- రబీ సీజన్‌లో భారీగా వరిసాగు
- గతవారం కురిసిన వర్షాలకు బోర్లలో సమృద్ధిగా నీరు
- పంటల సాగులో బిజీగా రైతులు

దొరవారిసత్రం : మండల పరిధిలో అన్నదాతలు పొలంబాట పట్టారు. గతవారం తుపాన్‌ ప్రభావంతో మూడురోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు చెరువులు, వాగులు, వంకల్లోకి నీరు చేరింది. అలాగే వ్యవసాయ బోర్లు, బావుల్లో భూగర్భజలాలు పెరిగాయి. రబీ సీజన్‌ ప్రారంభం కావడంతో రైతులు వరిసాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పొలాన్ని దుక్కులు చేసిన రైతులు వరి నాట్లు వేస్తున్నారు. మరికొందరు వారంరోజుల నుంచి పొలాలను ట్రాక్టర్లతో దున్ని దమ్ము చేసి, చెక్క తోలి, వరి నారు పెరికించి వరినాట్లు వేసే పనుల్లో బిజీగా గడుపుతున్నారు. ఏ పొలంలో చూసిన రైతన్నలే కనిపిస్తున్నారు. మరోవైపు వరిసాగు పనులకు బయట ప్రాంతాల నుంచి వచ్చిన వలస కూలీలకు మంచి డిమాండ్‌ ఏర్పడింది. ఇప్పటికే వెదురుపట్టు, తనియాలి, తల్లంపాడు, లింగంపాడు, మోదుగులపాళెం, బురదమడుగు, ఉచ్చూరు, కుప్పారెడ్డిపాళెం, వేణుంబాకం, పూలతోట, సింగనాలత్తూరు, వేటగిరిపాళెం, కమ్మకండ్రిగ, కొత్తకండ్రిగ తదితర గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. కొన్నిచోట్ల రైతులు నేలలో పచ్చిరొట్ట, జనుము, పిల్లిపెసరను కలిపి దుక్కులు చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో 4,500 ఎకరాల్లో వరి సాగు కావొచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.


టపాయిండ్లు గ్రామంలో పచ్చిరొట్ట ఎరువును కలియదున్నుతున్న దృశ్యం


తనియాలి గ్రామంలో వరి నారు పెరుకుతున్న కూలీలు


లింగంపాడులో ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి దున్నుతున్న రైతు

క్లుప్తంగా

సీసీలపై సస్పెన్షన్‌ ఎత్తేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, సీసీలు

చిల్లకూరు: డీఆర్‌డీఏలో పని చేసే సీసీలను అకారణంగా తొలగించడం ఎంత వరకు సబబని ఏపీ షెడ్యూల్డ్‌ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య ప్రశ్నించారు. గూడూరులోని సబ్‌ కలెక్టర్‌ కార్యాలయం ఎదుట గురువారం సస్పెన్షన్‌కు గురైన సీసీలతో కలిసి ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పొదుపులో పని చేసే సీసీలను ఇతర విషయాల్లో జోక్యం కల్పించుకునేలా చేసి, తరువాత వారిని తొలగించడం న్యాయమా ? అని నిలదీశారు. జిల్లా డీఆర్‌డీఏ అధికారులు స్పందించి వెంటనే తొలగించిన సీసీలను విధుల్లోకి తీసుకుని వారి కుటుంబాలకు అండగా నిలివాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎల్‌వీ సుబ్బయ్య, పల్లిపాటి అశోక్‌, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గూడూరురూరల్‌: గూడూరు పట్టణంలోని డీఎన్‌ఆర్‌ కమ్యూనిటీ హాల్‌లో గురువారం పెళ్లకూరు మండలం చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర అరవింద నేత్రాలయ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యులు ముందుగా వృద్ధులకు కంటి చూపుపై అవగాహన కల్పించారు. అనంతరం కంటి పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్స అవసరమైన వారికి తిరుపతిలోని వేంకటేశ్వర అరవింద ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయడం జరుగుతుందని తెలిపారు. సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించి 75 మందికి ఉచితంగా మందులు, 35 మందికి కంటి అద్దాలు, 21 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కంటి వైద్యులు, సంస్థ ఎండీ గౌరీశంకర్‌, సీఈఓ సీతారామనాయుడు, ఏఓ గల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు భూమిపూజ


శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌

వాకాడు: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ కొత్త సీసీ రోడ్లు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన దుగ్గరాజపట్నం, ముట్టెంబాక, వాకాడు టెంకాయతోపు కాలనీలో మూడు నూతన సీసీ రోడ్లు వేయనున్నారు. అనంతరం ఆయన వివిధ పొదుపు రుణాలకు సంబంధించి మహిళలకు చెక్కులు అందజేశారు. ఆయన వెంట నాయకులు విజయశేఖర్‌రెడ్డి, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కోటపోలూరు విద్యార్థి



సూళ్లూరుపేట రూరల్‌: మండలంలోని కోటపోలూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు చెందిన కె. క్రాంతి కుమార్‌ వాలీబాల్‌ అండర్‌ -14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ఆ పాఠశాల హెచ్‌ఎం చంద్రజీత్‌ తెలిపారు. పలు క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, అందుకు తమ పాఠశాల పీఈటీ సన్నాయి భాస్కర్‌ కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రైతులకు న్యాయం చేస్తాం


గ్రామసభలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్‌

దక్కిలి: నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్‌ నిర్మాణ పనుల కోసం భూములు కోల్పోతున్న రైతులందరికీ న్యాయం చేస్తామని గూడూరు సబ్‌ కలెక్టర్‌ రాఘవేంద్ర మీనా తెలిపారు. మండలంలోని వెలుగొండల కింద గ్రామాలైన ఆల్తూరుపాడు, దేవునివెల్లంపల్లి, వెంబులూరు, మాధవయ్యపాళెం గ్రామాల్లో రైల్వే పనులు జరిగే భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించేందుకు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్‌ మాట్లాడుతూ భూములు కోల్పోయే ప్రతి రైతుకూ న్యాయం చేస్తామన్నారు. రైతులకు సంబంధించిన భూముల రికార్డులను స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. మొదట విడత కింద ఇప్పటికే భూములు కోల్పోయిన రైతుల జాబితాను గుర్తించారు. రైల్వే లైన్‌కు సంబంధించి 105 ఎకరాల భూములకు సంబంధించి రికార్డులను ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్‌ మోపూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట ఎస్‌ఐపై ఫిర్యాదు


జిల్లా ఎస్పీ సుబ్బరాయుడికి ఫిర్యాదు చేస్తున్న బార్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేటకు చెందిన న్యాయవాది ధర్మాప్రసాద్‌పై అనుచితంగా ప్రవర్తించిన ఎస్‌ఐ బ్రహ్మనాయుడుపై చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట బార్‌ అసోసియేషన్‌ సభ్యులు గురువారం తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు శ్రీరాములు యాదవ్‌ మాట్లాడుతూ సూళ్లూరుపేట కోర్టులో గడిచిన 33 ఏళ్లుగా న్యాయవాది వృత్తిలో వున్న ధర్మాప్రసాద్‌ను సివిల్‌ వివాదంలో ఎస్‌ఐ పోలీస్‌స్టేషన్‌కు పిలిచి అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా కానిస్టేబుళ్లతో బయటకు గెంటేయడం మంచి పద్ధతి కాదన్నారు. సదరు ఎస్‌ఐపై క్రమశిక్షణా రాహిత్య చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌ చేశారు. తమకు న్యాయం చేయాలని, లేదంటే విధులు బహిష్కరించి నిరసనలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట బార్‌ అసోసియేషన్‌ న్యాయవాదులు పాల్గొన్నారు.

పరామర్శ


లక్ష్మీపతిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

చిట్టమూరు(చిల్లకూరు) : చిట్టమూరు మండలం ఈశ్వరవాకకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచారెడ్డి లక్ష్మీపతిరెడ్డిని గురువారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ పరామర్శించారు. ఇటీవల లక్ష్మీపతిరెడ్డి తల్లి బేబిసరోజనమ్మ మృతి చెందారు. గురువారం గ్రామంలో జరిగిన సరోజనమ్మ కర్మక్రియలకు ఆయన హాజరయ్యారు. ఆయన వెంట మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సన్నారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రాజీవ్‌రామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, మనోహరరెడ్డి, వైస్‌ ఎంపీపీ వెంకటరమణయ్య, మస్తానయ్య, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం


నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేసిన డీఎస్పీ చెంచుబాబు, ఇతర సిబ్బంది

నాయుడుపేటటౌన్‌ : విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐలు బాబీ, సంగమేశ్వరరావుతో కలిసి నివాళులు అర్పించారు. అమరవీరుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో డీఎస్పీ నేతృత్వంలో సీఐలు సర్కిల్‌ పరిధిలోని ఎస్‌ఐలతో కలసి రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అమర వీరులైన పోలీసులను స్మరించుకుంటూ సంక్షేమ కార్యక్రమాలు, డివిజన్‌ పరిధిలోని సర్కిల్‌ స్టేషన్ల వద్ద భారీ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన డీఎస్పీకి సూపరిండెంట్‌, సీఐ సంగమేశ్వరరావుకు డీఎస్పీ ప్రశంసాపత్రాలు అందించారు. నాయుడుపేట అర్బన్‌, రూరల్‌ సీఐలతో పాటు సర్కిల్‌ పరిధిలోని మూడు మండలాలకు చెందిన ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు పోలీసులు రక్తదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక యువత రక్తదానం చేశారు.

మడి భిక్షాలతో పోలేరమ్మకు మొక్కులు


మడిభిక్షాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తజనం


దున్నపోతును ఊరేగిస్తున్న జాతర నిర్వాహకులు

సైదాపురం: గ్రామశక్తి పోలేరమ్మ జాతర గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. జాతరలో భాగంగా బుధవారం తెల్లవారుజామున పోలేరమ్మకు గురువారం వివిధ కులాలవారు నైవేద్యాలు సమర్పించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు జాతరకు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా వేపాకులతో వేసిన పందిరిలో కొలువుదీర్చారు. గురువారం రాత్రి నుంచి గ్రామానికి చెందిన ఆరు కులాలకు చెందిన వారు ప్రత్యేకంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం దున్నపోతును మొదటిగా అమ్మవారి వద్ద నిలబెట్టి ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిమంది భక్తులు పోలేరమ్మ తల్లి దర్శనం కోసం బారులు తీరారు.

విద్యుత్‌ కాంతులతో: మండల కేంద్రం సైదాపురంలో జాతర సందడి ప్రారంభమైంది. ఈ సందర్భంగా పుర వీధుల్లో విద్యుత్‌ దీపాలంకరణ ఆకట్టుకున్నాయి. వీధుల్లో విద్యుత్‌దీప కాంతులతో అమ్మవారి ప్రతిమలు ఏర్పాటు చేశారు.

కండలేరులో 39.562 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం 39.562 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9400 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయిగంగ కాలువకు 340, పిన్నేరు కాలువకు 10, లోలెవల్‌ కాలువకు 10, మొదటి బ్రాంచ్‌ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దుకాణదారుల నిరసన

కోట: మండలకేంద్రంలోని బజారువీధిలో ఉన్న పంచాయతీకి చెందిన దుకాణాల్లో వ్యాపారాలు చేసుకునేవారు గురువారం నిరసన తెలిపారు. వ్యాపారులు తక్కువ అద్దె చెల్లిస్తున్నారని కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్‌ క్షేత్రస్థాయిలో పరిశీలనకు డీఎల్‌పీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో విచారణ కమిటీని నియమించారు. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ప్రతి దుకాణదారుడు నెలకు రూ.18,300 చొప్పున అద్దె చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ తెలిపారు. దీంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా అద్దె పెంచి తమపై ఒత్తిడి తెస్తున్నారని, చిరు వ్యాపారాలు చేసుకునే తాము వారు అంత అద్దె చెల్లించాలంటే కష్టమన్నారు.

దూరవిద్యను ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న కోఆర్డినేటర్‌

గూడూరురూరల్‌: దూరవిద్యను ప్రోత్సహించాలని అప్పాస్‌ గుంటూరు కోఆర్డినేటర్‌ శ్రీనివాసులరెడ్డి సూచించారు. పట్టణంలోని జెడ్పీ హైస్కూలులో గురువారం దూరవిద్యపై ఉపాధ్యాయులు, దూరవిద్య కోఆర్డినేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూరవిద్యతో ఇంటి వద్దనే ఉంటూ పదో తరగతి తోపాటు ఇంటర్‌ కూడా పూర్తి చేయవచ్చన్నారు. ఆ తరువాత డిగ్రీ కూడా పూర్తి చేసుకుని, ఉద్యోగావకాశాలు పొందడమే కాకుండా మంచి వ్యాపారవేత్తలుగా కూడా ఎదిగే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భారతి, స్టేట్‌ కోఆర్డినేటర్‌ నాగేంద్ర, తిరుపతి జిల్లా కోఆర్డినేటర్‌ గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన


రైతులకు టమాట, బంతినార్లను పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

వెంకటగిరిరూరల్‌ : రైతులు కూరగాయల పంటల సాగులో శాస్త్రీయ పద్ధతుల్లో మెళకువలు పాటిస్తే నాణ్యమైన దిగుబడి వస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. పట్టణంలోని కృషివిజ్ఞాన కేంద్రంలో గురువారం రైతులకు కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన తోటల్లో మేలైన కూరగాయల సాగుపై దృష్టి సారించాలన్నారు. దీంతో నాణ్యమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయని ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. రైతులు ఈ మేరకు దృష్టి సారించాలని తెలియజేశారు. అదేవిధంగా పండ్లతోటలతో పాటు, పూలసాగుపై దృష్టి సారించాలని తెలియజేశారు. అనంతరం రైతులకు టమాట, బంతినారును పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త విజయశ్రీ, తిరుపాల్‌, రాజీవన, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

నాయుడుపేటటౌన్‌: మండల పరిధిలోని అన్నమేడు గ్రామ సమీపంలో జరుగుతున్న సాగరమాల జాతీయ రహదారి నిర్మాణ పనులను గురువారం తహసీల్దారు గీతావాణి పరిశీలించారు. అన్నమేడు వద్ద రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం సేకరించిన భూముల వద్ద జరుగుతున్న పనులను ఇటీవల సూళ్లూరుపేట ఆర్డీఓ కూడా తనిఖీ చేశారు. పనులు నాణ్యతగా చేపట్టాలని ఆమె సూచించారు. డిప్యూటీ తహసీల్దారు రాజేంద్ర, సర్వేయర్లు తదితరులు ఉన్నార

కార్మికుల సమస్యలు పరిష్కరించండి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరురూరల్‌ : మున్సిపాలిటీలో పని చేసే పారిశుద్ధ్య కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు గూడూరు మున్సిపల్‌ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 17 రోజుల పాటు పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేపట్టగా అప్పట్లో ప్రభుత్వం వారి డిమాండ్‌లను తీర్చేందుకు సిద్ధమైందని తెలిపారు. అయితే నేటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అలాగే పదవీ విరమణ బెనిఫిట్స్‌, 10 ఏళ్ల సర్వీస్‌ ఉంటే రూ.75 వేలు, ఆపై, ఏడాదికి ఒకసారి రూ.2 వేలు చెల్లింపు, ప్రమాద మృతులకు రూ.7 లక్షల బీమా చెల్లింపు, దహన సంస్కారాలకు రూ.20 వేలు క్లాప్‌ డ్రైవర్లకు న్యాయబద్ధంగా జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌ ఎంప్లాయీస్‌ తిరుపతి జిల్లా కార్యదర్శి గోపినాథ్‌, కోటేశ్వరరావు, రాజేష్‌, శివకుమార్‌, శ్రీనివాసులు, రమణయ్య, సురేష్‌, అడపాల ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


దక్కిలి: మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ

దక్కిలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన, రుచికరంగా ఉండే భోజనం పెట్టాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం ఆయన దక్కిలి పంచాయతీలోని కందలవారిపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు మధ్యాహ్నం అందించే భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం నాణ్యత ప్రమాణాలతో భోజనం తయారు చేయాలని వంట నిర్వాహకులకు సూచించారు. స్కూల్‌ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సరళకుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం : నెలబల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను స్థానిక ఎంఈఓ కృష్ణయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్నం భోజనం రుచి చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అందుతోందా ? లేదా ? అని ఆరా తీశారు. అనంతరం పాఠశాలల రికార్డులను పరిశీలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గూడూరు విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

గూడూరురూరల్‌: పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు హాకీ పోటీలు జిల్లాస్థాయి అండర్‌-14, అండర్‌, -17 విభాగాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మాధవీ లక్ష్మి తెలిపారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎస్‌కే మిస్‌బా, అండర్‌-17 విభాగంలో కౌసల్య, దీపక జిల్లాస్థాయిలో మంచి ప్రతిభ కనపరిచారన్నారు. అలాగే దీపిక వాలీబాల్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. స్కూల్‌గేమ్స్‌ ఫెడరేషన్‌ తరుపున అనకాపల్లి, విజయనగరంలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులను నవంబర్‌లో పంపనున్నట్లు తెలిపారు.

సూపర్‌సిక్స్‌ అమలెప్పుడు బాబూ ?


మాట్లాడుతున్న కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి

సూళ్లూరుపేట : సూపర్‌ సిక్స్‌ పథకాలు ఇస్తామని చెప్పి ఎన్నికల్లో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చి 120 రోజులు గడిచిపోతున్నా వాటి గురించి ఊసే లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మీనమేషాలు లెక్కిస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్‌ ఈదా సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం సూళ్లూరుపేటకు విచ్చేసిన ఆయన డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పి దాన్ని కేవలం దీపం పథకంలో కనెక్షన్లు ఉన్న వారికే ఇస్తామని నిబంధనలు పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణంలో, తల్లికి వందనం పథకాల అమలులో కూడా ఇలాంటి నిబంధనలే పెడతారేమో ? అనే అనుమానం కలుగుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మీకు మీరే స్టిక్కర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు వేసుకుని ‘ఇది మంచి ప్రభుత్వం’ అని చంకలు గుద్దుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు ఏనాడూ చెప్పిన మాట మీద నిలబడడు అనే విషయం అందరికీ తెలుసన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీని బలోపేతం చేయడానికి జిల్లాల పర్యటనలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు, సూళ్లూరుపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్‌ మామడూరు వెంకటాచలపతి, పార్టీ నాయకులు రాయం రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌బైక్‌ అదుపుతప్పి..


విజయ్‌ కుమార్‌ (ఫైల్‌)

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతల సమీపంలో మోటార్‌బైక్‌ అదుపుతప్పి కలువాయికి చెందిన ఇంజినీరింగ్‌ విద్యార్థి ధనియాల విజయ్‌ కుమార్‌ (22) మృతిచెందాడు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కలువాయి మండలం వేదనపర్తికి చెందిన విజయ్‌ కుమార్‌ కుమార్‌, దగదర్తి మండలం మార్లెల్లపల్లికి చెందిన వినయ్‌ కుమార్‌లు కడనూతలలోని ఆర్‌ఎస్సార్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో సివిల్‌ ఇంజినీరింగ్‌ ఫైనలియర్‌ చదువుతున్నారు. గౌరవరంలో గది అద్దెకు తీసుకుని రోజూ కళాశాలకు వచ్చి వెళ్తుంటారు. గురువారం సాయంత్రం కడనూతల నుంచి గౌరవరం వెళ్తుండగా ముంగమూరు కూడలి సమీపంలో బైక్‌ అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో విజయ్‌ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వినయ్‌ తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై భోజ్యా ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కాగా ఫైనలియర్‌ విద్యార్థి మృతితో ఆర్‌ఎస్సార్‌ విద్యార్థులు, అధ్యాపకుల్లో విషాదం నెలకొంది.

మృతదేహం వెలికితీత


పూడ్చిన మృతదేహాన్ని వెలికి తీస్తున్న ఆస్పత్రి సిబ్బంది

చిల్లకూరు: అనుమానాస్పదంగా మృతి చెందిన గిరిజనుడి మృతదేహాన్ని గురువారం పోలీసులు వెలికితీశారు. చిట్టమూరు ఎస్‌ఐ చిన బలరామయ్య కథనం మేరకు.. మండలంలోని కోగిలి గ్రామంలో రెహమాన్‌ అనే వ్యక్తికి చెందిన రొయ్యల గుంత వద్ద గూడూరు వీరారెడ్డిపల్లి గిరిజన కాలనీకి చెందిన కృష్ణయ్య అనే వ్యక్తి కుటుంబంతో కలసి కాపలాగా ఉంటున్నారు. అయితే యజమాని రెహమాన్‌ ఇటీవల కృష్ణయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో కృష్ణయ్య మనస్తాపం చెందిన ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లేసరికే మృతదేహాన్ని గూడూరుకు పంపి, పూడ్చివేశారు. దీంతో పోలీసులు స్థానిక వీఆర్వో ద్వారా ఫిర్యాదు తీసుకుని ఉన్నతాధికారుల సూచనలతో గురువారం గూడూరులో పూడ్చివేసిన మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం గూడూరు తహసీల్దార్‌ చంద్రశేఖర్‌ పర్యవేక్షణలో గూడూరు ఏరియా ఆస్పత్రి వైద్యులు శవ పరీక్షలు చేశారు. ఫోరెన్సిక్‌ నివేదికలు వచ్చిన తరువాత కృష్ణయ్య మృతికి గల కారణాలను గుర్తించి, అందుకు సంబంధించిన వ్యక్తులపై చర్యలు చేపడతామని ఎస్‌ఐ తెలిపారు.

రోగాల నియంత్రణపై సమీక్ష

రాపూరు: వర్షాల కారణంగా గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా ఆరోగ్యసిబ్బంది చర్యలు చేపట్టాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు సూర్యధర్మేంద్ర తెలిపారు. ఆరోగ్యకేంద్రంలో గురువారం ఆరోగ్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్లోరినేషన్‌ చేసిన నీటిని వినియోగించుకోవాలని, నీటిని కాచి చల్లార్చుకుని తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 104 వైద్యసేవలు జరుగుతున్న సమయంలో రోగులకు సమాచారం ఇచ్చి రోగులను వాహనం వద్దకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పాల్గొన్నారు.